"CHAN

హైదరాబాద్, 15.11.2014:

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం 'చంద్రం' భవన్‌లో "**తెలంగాణ రాష్ట్రంలో బాలల హక్కులు–చట్టాలు–పరిరక్షణ**" అనే అంశంపై టిఆర్‌సి 148వ చర్చగాకార్యక్రమం జరిగింది. ఈ చర్చలో తెలంగాణ జాగ్రఫీ శాఖాధిపతి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొ॥ ఫాతిమా అలీఖాన్, ఎం.వి. ఫౌండేషన్ నేషనల్ కన్వీనర్ శ్రీ ఆర్. వెంకట్‌రెడ్డి, తెలంగాణ బాలల హక్కుల వేదిక కన్వీనర్, మరియు సాధనా ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీ సి.హెచ్. మురళీమోహన్, దివ్యదిశ డైరెక్టర్ ఇసిడోర్‌ఫిలిప్స్, అడ్వకేట్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎపిఎస్‌సిపిసిఆర్ – ఎ.పి.స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) మెంబర్ మహ్మద్ రహీముద్దీన్ .....వక్తలుగా పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అనుకుంటున్న విధంగా బంగారు తెలంగాణలో పిల్లల అక్షరాస్యత అనుకున్నంత ఆశాజనకంగా లేదు. కేవలం 28% మాత్రమే అక్షరాస్యత ఉండగా 72% నిరక్షరాస్యత ప్రబలి ఉంది. బంగారు తెలంగాణను సాధించాలంటే పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారిని పాఠశాలలకు వెళ్ళే విధంగా దోహదపడాలి. చాలా స్కూళ్ళలో కనీస వసతులు, మరుగుదొడ్లు లాంటివి లేకపోవడం బాధాకరం.

ఒక సంవత్సరం నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారిని పిల్లలకు నిర్వచనంగా అనుకోబడుతున్నది. ఏ ప్రభుత్వమైనాగానీ పిల్లల హక్కులకు భంగం కలిగించకుండా కావలసిన సౌకర్యాలు కల్పిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాయి. ఏ గ్రామానికి వెళ్ళినా ఓటర్ల జాబితా గురించి ఏ పౌరుడైనా నిస్సంకోచంగా సంఖ్యను చెప్పగలుగుతారు. అదే పిల్లల సంఖ్య చెప్పలేరు. ఇది చాలా సందర్భాలలో మేము వివిధ గ్రామాలు సందర్శించినపుడు గమనించిన విషయం. శ్రద్ధ అనేది ప్రభుత్వానికే కాకుండా తమ తల్లిదండ్రులకు కూడా పిల్లలపట్ల ఉండి వారికి ఉన్నత బోధన కల్పించేందుకు వాళ్ళ సాయశక్తులా కృషి చేస్తూ వాళ్ళ హక్కులకు, వాళ్ళ స్వతంత్రానికి పెద్దపీట వేయాలి.

బాలికల చదువు గురించి వాళ్ళ తాత ముత్తాతలు సేవ చేయ సంకల్పించి ఒక ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను 72 సంవత్సరాల క్రిందట స్థాపించి అతి బీద విద్యార్థినులకు ఉచిత విద్యను అందజేస్తూ సమాజంలో ఒక మార్పుకు నాంది పలికారు. బాలికలకు సరియైన రక్షణ మరియు అవసరమైన సౌకర్యాలు (బాల బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు) కల్పిస్తే తల్లిదండ్రులు పిల్లలను స్కూళ్ళకు పంపిస్తారు. స్కూలు సమయాలలో పిల్లలు బయట ఏదో పనిమీద నిమగ్నమయ్యారంటే ఏదో పొరపాటు జరిగింవారి తల్లిదండ్రులకు సరియైన అవగాహన కల్పించి ఆ పిల్లలను పాఠశాలకు పంపే విధంగా దోహదపడాలి. ఈ పద్ధతిని పాశ్చాత్య దేశాలలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాటిస్తున్నారు.

ప్రభుత్వం అంటున్నట్లుగా కెజి నుంచి పిజి వరకూ పిల్లలకు ఉచిత విద్య కంటే 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉచిత నాణ్యతకల విద్య కల్పిస్తే వాళ్ళు తమ స్వంత కాళ్ళమీద నిలబడి వారి జీవనాధారాన్ని సమకూర్చుకోగలుగుతారు. కేంద్ర ప్రభుత్వం రెండు మూడు రోజుల్లో పిల్లల వయస్సును 18 నుంచి 16 సంవత్సరాలకు కుదించేందుకు బిల్లు ప్రవేశపెట్టనుంది. ఏవిధంగానైనా ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదింపచేస్తారు. ఇది సరైంది కాదు. 18 సంవత్సరాలనే కొనసాగించడం న్యాయం.

గ్రామీణ మరియు పట్టణ స్థాయిలో పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు చర్చలో పాల్గొనే సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎపిఎస్‌సిపిసిఆర్ – ఎ.పి.స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) దృష్టికి తీసుకువస్తే సరియైన చర్యలు తీసుకుంటామని అన్నారు. 25 సంవత్సరాల తర్వాత కూడా పిల్లల హక్కుల పట్ల ప్రజలలో సరైన అవగాహనారాహిత్యానికి కారణం– అధికారుల అలసత్వం మరియు సహకారం లేకపోవడమే. 2009లో విద్యా హక్కు చట్టం తీసుకువచ్చినా, అమలులోకి వచ్చింది కానీ సరైన అవగాహన లేక మరియు అధికారుల సమన్వయ లోపం వలన ఆచరణలోకి రాలేదు. అదేవిధంగా యుఎల్‌సిఆర్‌ఇ, బాలకార్మిక నిషేధం మరియు బాల్యవివాహ నిషేధం చట్టాలు ఎప్పటినుంచో అమలులో ఉన్నాకానీ వాటిపట్ల అవగాహన కల్పించకపోవటంవలన గ్రామాలు, పట్టణాలలో ఇంకా బాల్య వివాహాలు మరియు బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నాయి. 2006లో బాలల హక్కుల చట్టం రూపొందించబడింది. 2014లో ఎపిఎస్‌సిపిసిఆర్ స్థాపించబడింది. బాలల విద్యావిధానంలో 75% ప్రైవేటు పాఠశాలల్లో ఇచ్చే కార్పొరల్ పనిష్మెంట్ కమిషన్ దృష్టికి వచ్చింది. చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నాయి.

ఈ కార్యక్రమంలో సిహెచ్ సుధాకర్, రాజవర్ధన్, కె.నర్సింహారెడ్డి, మల్లేశ్వరి, కళ్యాణి, క్రిష్ణకుమార్, ప్రకాష్, టిఆర్‌సి ఛైర్మన్ వేదకుమార్ పాల్గొన్నారు.

**తెలంగాణ రిసోర్స్ సెంటర్**